## జలమండలి జీఎం బ్రిజేష్ బాధ్యతల స్వీకరణ



**హఫీజ్‌పేట్:** శేరిలింగంపల్లి డివిజన్ జలమండలి నూతన జనరల్ మేనేజర్‌గా బ్రిజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా జలమండలి విభాగం అధికారుల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా శేరిలింగంపల్లి డివిజన్ జీఎంగా విధులు నిర్వహించిన రాజశేఖర్ గోదావరి ట్రాన్స్‌మిషన్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. కాగా అక్కడ జీఎంగా విధులు నిర్వహిస్తున్న బ్రిజేష్ శేరిలింగంపల్లికి వచ్చారు.

## భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి

**జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు**



**శేరిలింగంపల్లి:** కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్‌ను సోమవారం నల్లగండ్లలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కలిసి భవన నిర్మాణానికి స్థల కేటాయింపునకు చొరవ తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి స్థల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు లక్ష్మణ్ గుప్త, బచ్చురాజు, వెంకటేష్ గుప్త, సందీప్, విష్ణు, ప్రభాకర్, వజ్రలింగ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## యువ ఇంజనీర్ల నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యం

**హెచ్ఐసీసీలో పెగా ఇన్నోవెట్- 2024**



మాట్లాడుతున్న దీపక్ విశ్వేశ్వరయ్య

**మాదాపూర్:** సాంకేతిక నైపుణ్యాల సవాళ్లను అధిగమించడానికి ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నామని ఇండియా పెగాసిస్టమ్స్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ విశ్వేశ్వరయ్య తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సోమవారం పెగా ఇన్నోవెట్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యమన్నారు. ఎంపిక చేసిన 100 మందికిపైగా సర్టిఫైడ్ సీనియర్ సిస్టమ్ ఆర్కిటెక్స్ ధ్రువీకరణ పొందిన విద్యార్థుల కోసం రూపొందించడం జరిగిందన్నారు. రెండు వారాల పాటు జరిగే ఈ ప్రోగ్రామ్‌లో టెక్నాలజీలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటారన్నారు. శిక్షణ అనంతరం డిజిటల్ సర్టిఫికెట్‌లు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెరిజోన్ డైరెక్టర్ హరిణీ శ్రీధర్, కారెలోన్ సీనియర్ డైరెక్టర్ విశాల్ మహజన్ తదితరులు పాల్గొన్నారు.

## చందానగర్ సర్కిల్- 21 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాజ్‌కుమార్ బదిలీ

**హఫీజ్‌పేట్:** చందానగర్ సర్కిల్ 21 టౌన్‌ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాజ్‌కుమార్ సోమవారం బదిలీ అయ్యారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏసీపీ రాజ్‌కుమార్‌ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంకు అటాచ్ చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ 20 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మెప్రాకు చందానగర్ సర్కిల్ 21 ఏసీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## నిధులు మంజూరు చేయాలని వినతి

**పటాన్‌చెరు టౌన్:** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాలనీలలో అంతర్గత డ్రైనేజీల నిర్మాణం, నూతన పైపులైన్లు, రోడ్ల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సోమవారం హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ బోర్డ్ ఎండీ అశోక్‌రెడ్డిని ఖైరతాబాద్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని అడిగితే, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి బోర్డులో నిధులే లేవని చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలన్నారు.

## బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా బలరాం

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా రామచంద్రాపురం పట్టణానికి చెందిన బలరాంను నియమిస్తూ సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి నియామక పత్రాన్ని అందించారు.

## గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయాలి

**సైబర్‌క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి**

**పటాన్‌చెరు టౌన్:** సైబర్ నేరగాళ్ల బారినపడి పోగొట్టుకున్న నగదును తిరిగి పొందేందుకు గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ...సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే నిమిషాల వ్యవధిలో 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. డబ్బు పోగొట్టుకున్న తర్వాత మొదటి గంటను 'గోల్డెన్ అవర్'గా పేర్కొంటారని తెలిపారు. నగదు పోగొట్టుకున్న నిమిషాల్లో ఫిర్యాదును నమోదు చేస్తే ,తక్షణ రిపోర్టింగ్ ద్వారా నిందితుల బ్యాంక్ ఖాతాలు లేదా డిజిటల్ వాలెట్లలో మొత్తాన్ని స్తంభింపజేసే అవకాశం ఉంటుందన్నారు. దీంతో బాధితులు పోగొట్టుకున్న నగదును రికవరీ చేయడం సులభతరం అవుతుందని తెలిపారు.

## బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట సైబర్ మోసం

**రూ.13 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేటు ఉద్యోగి**

**పటాన్‌చెరు టౌన్:** బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఓ ప్రైవేటు ఉద్యోగి రూ.13 లక్షలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం మేరకు... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి జూన్ 5వ తేదీ వాట్సప్‌కు ఓ మెసేజ్ వచ్చింది. బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇస్తామని చెప్పడంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ప్రైవేటు ఉద్యోగి తన వివరాలను నమోదు చేసి, పలు దఫాలుగా రూ.13 లక్షల 83 వేలు ఇన్వెస్ట్ చేశాడు.దీంతో బాధితులు తాను పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో అపరిచిత వ్యక్తి స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్టు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

# హరిత శేరిలింగంపల్లి లక్ష్యంగా..

**సర్కిల్‌లో ఈ ఏడాది 4.55 లక్షల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు**

**వన మహోత్సవంలో అందరినీ భాగస్వాములు చేయడమే సంకల్పం**



నల్లగండ్ల హుడా కాలనీ సెంట్రల్ నర్సరీలో పెంచుతున్న మొక్కలు

**శేరిలింగంపల్లి:** 'శేరిలింగంపల్లిని హరితమయం చేసే లక్ష్యంతో అధికార యంత్రాంగం తగు ప్రణాళికతో ముందుకుసాగుతోంది. అందుకోసం 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. ప్రతి ఏటా భారీగా మొక్కలను నాటుతూ సర్కిల్ పరిధిలో గ్రీనరీ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ పార్కులు, కాలనీలు, బస్తీలు ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు, చెరువు కట్టలు, స్కూల్ ప్రాంగణాలు, చెరువులు, కుంటలు, ప్రభుత్వ ఆఫీస్‌లలోని ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులు ప్రారంభించారు. ఇప్పటికే రోడ్లకు ఇరువైపులా, డివైడర్‌పై, చెరువుల సుందరీకరణలోనూ గ్రీనరీకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

- శేరిలింగంపల్లి సర్కిల్‌లోని మూడు డివిజన్లలో వనమహోత్సవం -2024లో 4.55 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్ణయించారు
- మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకుంటున్నారు.
- ఎండిన మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- వన మహోత్సంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేసే దిశగా సాగుతున్నారు
- శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు.
- సర్కిల్‌లోని డివిజన్‌లతో పాటు భెల్ ఎంఐజీ కాలనీలో కూడా విరివిగా మొక్కలు నాటాలని నిర్ణయించారు.
- ప్రధాన రోడ్డులోని మీడియంలో రకరకాల పూల మొక్కలతో పాటు ఖాళీ ప్రదేశాలు, చెరువులు, కుంటలలో అల్ల నేరేడు, రావి, చింత, మహాగని, కానుగ, వేప, గుల్‌మొహర్, బింగోనియా, రావి, స్పటోడియా తదితర మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్నారు.
- కాలనీలు, పార్కులు ,రోడ్లు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేలా ప్రణాళిక రూపొందించారు.
- సర్కిల్‌లో పరిధిలో 34 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఆయా చెరువుకట్టలపై మొక్కలు నాటనున్నారు.



**నర్సరీల్లో మొక్కల పెంపకం..**

- హరితహారంలో భాగంగా ఈ ఏడాది శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో భారీగా మొక్కలు నాటేందుకు అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.
- నల్లగండ్ల హుడా కాలనీ సెంట్రల్ నర్సరీలో ,రాజేంద్రనగర్, హెచ్ఎండీఏ నర్సరీల నుంచి మొక్కలు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.
- శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ప్రధాన రోడ్లలో అవెన్యూ ప్లాంటేషన్ ప్రణాళికలు చేస్తున్నారు.
- రోడ్లకు ఇరువైపులా, మధ్య భాగంలో మొక్కలు నాటనున్నారు
- ప్లాంటేషన్ భాగంగా సుమారు 2500 మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేశారు.

**అవసరమైన వారికి మొక్కలు ఇస్తాం..**

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో వనమహోత్సం కింద ఈ ఏడాది 4.55 లక్షల మొక్కలు నాటుతాం. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. సర్కిల్ పరిధిలోని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, మొక్కలు కావాలనుకునే వారు బయోడైవర్సిటీ అధికారులను సంప్రదిస్తే అవసరమైన మొక్కలు ఇస్తాం. వనమహోత్సవంలో అందరినీ భాగస్వాములను చేయడమే లక్ష్యం.

*–ఎస్.విక్రమ్ చంద్ర, మేనేజర్ అర్బన్ బయోడైవర్సిటీ, శేరిలింగంపల్లి సర్కిల్*

## ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటుచేయండి



తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మల్లేపల్లి బుచ్చిరెడ్డి

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** రామచంద్రాపురం మండల పరిధిలోని చెరువులు, కుంటలను సర్వే చేసి అధికారులు వెంటనే హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రాపురం మండలంలో భూముల ధరలు పెరగడంతో రియల్ వ్యాపారులు చెరువులను, కుంటలను వదలడం లేదన్నారు.దీంతో చెరువులు, కుంటలు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పాత మ్యాప్‌ల ఆధారంగా గ్రామస్తుల సమక్షంలో అధికారులు చెరువులు, కుంటలను సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేసి కాపాడాలని ,లేనిపక్షంలో చెరువుల పరిరక్షణకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## నేడు ఎదురుగడ్డ మైసమ్మ బోనాలు



**రాయదుర్గం:** ఎదురుగడ్డ మైసమ్మ ఆలయ బోనాలను మంగళవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌లో జరిగే బోనాల వేడుకలకు నానక్‌రాంగూడ, ఖాజాగూడ, గచ్చిబౌలి, చార్మినార్ ప్రాంతవాసులు పాల్గొంటారు. బోనాల ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడుఎం రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, ఉపాధ్యక్షుడు గోవింద్, కోశాధికారి రమేష్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

## పీడబ్ల్యూసీ అభ్యాస కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభించిన సంస్థ ఉన్నతాధికారులు

**రాయదుర్గం:** హైదరాబాద్ నాలెడ్జి సిటీలో ప్రైస్ వాటర్ హౌజ్‌కూపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (పీడబ్ల్యూసీ) తన అభ్యాస కేంద్రాన్ని సోమవారం ప్రారంభించింది. దానికి విద్యాపీఠ్ అని నామకరణం చేసింది. పూర్వం గురుకులాల విద్యాబోధన స్ఫూర్తిగా ఈ విద్యాపీఠ్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పీడబ్ల్యూసీ చైర్మన్ సంజీవ్‌కిషన్ మాట్లాడుతూ నిరంతర శిక్షణ, మార్గనిర్దేశకత్వం ద్వారా తమ ఉద్యోగులకు సమగ్ర అనుభవాలను అందించడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. గురుకుల వాతావరణంలో అభ్యాస అనుభవాలను అందించనున్నామన్నారు. తొలి ఆర్థిక సంవత్సరంలో 10వేల మంది ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. పీడబ్ల్యూసీ యాక్సిలరేషన్ సెంటర్ లీడర్ హరికుమార్ మాట్లాడుతూ అన్ని స్థాయిలలోనూ తమ ఉద్యోగుల ఎదుగుదలకు తోడ్పడటమే తమ లక్ష్యమన్నారు. ఈ విద్యాపీఠ్ అభ్యాస, అభివృద్ధి వాతావరణం అందించడమే కాకుండా ఆలోచనాత్మక నాయకత్వం, ఆవిష్కరణలకు వేదికగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మేరుత్సవ్ -2024 ఫెస్ట్ ప్రారంభం



మేరుత్సవ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం



పోటీలలో గెలుపొందిన విజేతలు

**హఫీజ్‌పేట్:** డివిజన్ పరిధి మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం మేరుత్సవ్ 2024 ఫెస్ట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ ప్రపంచ సమస్యలు స్థిరమైన అభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. భవిష్యత్ నాయకులను రూపొందించడంలో క్రీడలు, విద్య, సమాజం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. నగరంలోని 40 పాఠశాలలకు చెందిన 2500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువ క్రీడాకారులు క్రీడలలో వారి ప్రతిభను ప్రదర్శించారు. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయి. కాగా ఆగస్టు 3వ తేదీ వరకు విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు, ఈవెంట్‌లు నిర్వహిస్తామన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేతకు సర్కిల్‌కు ఓ బృందం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

**గచ్చిబౌలి:** అక్రమ నిర్మాణాలను ఉపేక్షించమని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు సర్కిల్‌కు ఒక బృందాన్ని నియమిస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా చేపట్టే నిర్మాణాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని ఆదేశించారు. కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి తగిన పత్రాలను సమర్పిస్తూ వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. మాల్స్‌లో పార్కింగ్ ఫీజులు వసూలు విషయంపై అధికారులు పర్యవేక్షించాలని, అక్కడ తినుబండారాల నాణ్యతను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్లు రజినీకాంత్‌రెడ్డి, వంశీ మోహన్, సీపీ మల్లిఖార్జున్, ఎస్ఈ శంకర్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై సత్వర చర్యలు



వెస్ట్ జోనల్ కార్యాలయంలో ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి



శేరిలింగంపల్లి సర్కిల్‌లో.. డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, అధికారులు

**వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి**

**గచ్చిబౌలి:** ప్రజావాణిలో వచ్చే వినతులు, ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు జడ్సీకి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

**7 వినతులు**

**హఫీజ్‌పేట్:** చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ఉపకమిషనర్ వంశీకృష్ణ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్‌కు విభాగానికి సంబంధించి 7 వినతిపత్రాలు అందాయని సమస్యను పరిష్కరించాలని డీసీ వంశీకృష్ణ ఆదేశించారు.

**శేరిలింగంపల్లి సర్కిల్‌లో..**

**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 7 ఫిర్యాదులు అందాయి. పింఛన్లకు నాలుగు, పారిశుద్ధ్యం ఒకటి, టౌన్ ప్లానింగ్ రెండు అందినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో ఏసీపీ మెప్రా, ఏఎంసీ శ్రవణ్‌రెడ్డి, సర్కిల్ ఏఈ లిఖిత, సర్కిల్ బయోడైవర్సిటీ మేనేజర్ విక్రమ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష



కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్‌ను కలిసిన జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌లలోని కాలనీ, బస్తీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. శేరిలింగంపల్లి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జగదీశ్వర్ గౌడ్ తెలిపారు.

**జెడ్‌సీని కలిసిన కార్పొరేటర్**

కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను సోమవారం వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు కలిసి డివిజన్ పరిధిలోని పలు సమస్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అదే విధంగా కొత్తగా చేపట్టాలిసిన పనులపై వినతిపత్రం అందించారు. స్పందించిన జోనల్ కమిషనర్ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

## 2 కేజీల హష్ ఆయిల్ స్వాధీనం

**విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్, రిమాండ్**

**మియాపూర్:** నిషేధిత గంజాయి (హష్ ఆయిల్)ను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 2కేజీల హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకునిరిమాండ్‌కు తరలించారు. సోమవారం సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మెట్రో స్టేషన్ బస్టాప్ సమీపంలో మియాపూర్ పోలీసులు, ఎస్ఓటి పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిశాకు చెందిన గోబింద్ బురుడి(21), జగన్నాద్‌ఖారా(28), లలిత్ బురుడి(20)లను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా హష్ ఆయిల్ దొరికింది. ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశాలోని మల్కన్‌గిరి, అరకు నుండి గంజాయిని హష్ ఆయిల్‌గా మార్చి తీసుకువచ్చి నగరంలో విక్రయాలు చేస్తున్నట్లు అంగీకరించారు. వైజాగ్ నుండి బస్సులో తీసుకువచ్చి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా మియాపూర్ పోలీసులు వారిని అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న 10లక్షల విలువచేసే రెండు కేజీల హష్ ఆయిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.





## జలమయం..

- చెరువును తలపించేలా హైటెన్షన్ లైన్ రోడ్డు
- నిలిచిన వర్షపు నీటితో పొంచి ఉన్న ప్రమాదం
- గుంతల రోడ్లతో ఇబ్బందులు
- పాఠశాలకు వెళ్తూ ఇటీవల గాయపడ్డ విద్యార్థి

**ఆల్విన్‌కాలనీ:** వర్షాలకు రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రోడ్లు గుంతలమయంగా మారటంతో వాటిలో నీరు నిలిచి ప్రమాదకరంగా మారాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పాపారాయుడు నగర్ నుంచి కూకట్‌పల్లి ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న హైటెన్షన్ లైన్ రహదారిలో ప్రయాణం అంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రహదారి నిర్మించి కొద్దిరోజులు కూడా గడవక ముందే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సుమారు మూడు అడుగుల లోతు గుంతలో నీరు నిలిచిపోవటంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఈ రహదారిలో వర్షపు నీరు వెళ్లడానికి సరైన మార్గం లేకపోవడంతో ప్రధాన రహదారిలోనే డివైడర్‌కు ఇరువైపులా నీరు నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. కూకట్‌పల్లి ప్రధాన రహదారిలోని మెట్రోకు వెళ్లే దారిలో సుమారు కిలోమీటర్ మేర ఇలాంటి పరిస్థితి ఉంది. చిన్న వర్షాలకే ఈ పరిస్థితి ఉంటే భారీ వర్షం వస్తే ఎలా ఉంటుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**వందల సంఖ్యలో రాకపోకలు**

కుత్బుల్లాపూర్ సర్కిల్ నుంచి ప్రతి రోజు విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు కూకట్‌పల్లి ప్రాంతానికి వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల రోడ్లతో నడుం నొప్పులు, మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళ్తున్న విద్యార్థి ఈ గుంతలో పడి గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. ఈ రహదారిని మరమ్మతులు చేసి వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



కూకట్‌పల్లి పాపారాయుడునగర్ హైటెన్షన్ రహదారి ఇలా..